# ఎంగిలి

-సూరి పండు



ఎన్నికలు. అంతవరకూ నిస్ప్రాణగా ఉన్న దేశం ఒక్కసారిగా లేచి ఒళ్ళు విదిలించుకొని బద్ధకంగా వదిలించుకున్నట్టుగా... దేశమంతటా ఒకటే హడావిడి. నామినేషన్లు... ఊరేగింపులు, ప్రచారాలు, విమర్శలూ, ప్రతివిమర్శలూ అన్ని పార్టీలూ వేగిర పడుతున్నాయి. ఎవరి నోట విన్నా ఎన్నికల సంగతులే! ఏ చోటా కన్నా పార్టీల తాలూకూ జండాల రెపరెపలే!!

పార్టీల తాలూకు వ్యక్తులయితే వాళ్ళ వాళ్ళ నాయకుల గొప్పదనాలను పొగుడుతూ, ఎదుటి పార్టీ అభ్యర్థులను, వాళ్ళ నాయకులను తెగడుతూ చిన్న సైజు ఉపన్యాసాలనే ఇస్తున్నారు. ఓమోస్తరు నాయకులైతే రచ్చబండల దగ్గిరా నాలుగు వీధుల కూడళ్ళలో వేదికల మీద పెద్దగానే వాగ్దానాలు చేస్తూ ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. జీపుల మీద, ఆటోల మీద చిన్నా, పెద్ద సైజుల్లో నాయకుల కటౌట్‌లు కట్టి మైకుల్లో ప్రచారం హోరెత్తిస్తున్నారు. అభ్యర్థులు పాదయాత్రలతో ప్రజల మధ్యకి వస్తున్నారు. ఎన్నడూ పేదవాడి ముఖమైనా చూడడానికి యిష్టపడని వాళ్ళు ఆప్యాయంగా...(నటనే కావచ్చు ఈమధ్య కొంత కాలంగా నట రాజకీయాలు, రాజకీయ నటనలు సాగుతుండడం అందరికీ అనుభవమే కదా!)

కౌగలించుకొంటున్నారు. గుడిసెల ముందు పారాడే చంటి పిల్లలను ఎత్తుకొని కారుతున్న ముక్కు చీమిడిని తమ పై కండువాతో తుడుస్తున్నారు. (మనసులో నుండి పొంగుకొచ్చే ఏవగింపుని ముఖంలో ప్రతిబింబించకుండా జాగ్రత్తపడుతూ!) చెట్లపై కెక్కుతూ, గుట్టలపై నుండి దూకుతూ, ఇంకా ఇంకా... రకరకాల జిమ్మిక్స్ చేస్తున్నారు. "అసమానతలను, రూపుమాపుతాం. పేదవారి పట్ల జరుగుతున్న అక్రమాలను అడ్డుకుంటాం. నిరుద్యోగ రక్కసికి నిలువ నీడ లేకుండా చేస్తాం. ఈ మురికి వాడల్లో పూరి గుడిసెల్లో కుక్కల్లా, పందుల్లా బ్రతుకుతున్న మీ దౌర్భాగ్యానికి ఇన్నాళ్ళుగా పాలించుతున్న "ఫలానా" పార్టీయే కారణం. అందుకని ఈసారి ఎన్నికల్లో మా "పార్టీ"ని గెలిపించండి. మీ దుస్థితిని దూరం చేసుకోండి. మీకు మూడుపూటలా తిండి కావాలంటే... మీరు కట్టుకొను బట్ట కావాలంటే... మీరు హాయిగా నివసించేందుకు పక్కా గృహాలు కావాలంటే... మా "పార్టీ"కే ఓటు వేయండి" అంటూ ప్రతి పక్ష పార్టీలన్నీ హామీల మీద హామీలు గుప్పించే స్తున్నాయి.

అధికార పార్టీ మాత్రం ఏమన్నా తక్కువ తిందా. "దేశ దుస్థితికి కారణం మధ్య మధ్యలో ఏలిన ఈ చిన్నా చితకా పార్టీలే. వాళ్ళకి ఐకమత్యంగా వుండటం చేతకాదు. అధికారం లేకపోతే లేదంటారు. అప్పగిస్తే వాళ్ళల్లో వాళ్ళకే కుమ్ములాటలకు దిగి వాళ్ళని వాళ్ళే కుర్చీ మీద నుంచి దిగలాగేసుకుంటారు. అలాంటి పార్టీలు ఇంక ప్రజలకేం చేస్తాయో మీరే నిర్ణయిం చుకోవాలి" అంటూ ప్రజల కోర్టులోనే బాల్ పడేస్తూ తన గొప్పలు చెప్పుకుంటోంది. జోరుగా హోరుగా సాగిపోతున్న ఎన్నికల ప్రచార నేపథ్యంలో.

అదో చిన్న పల్లెటూరు. ఊరి జనాభా ఓ రెండు వేల మందయితే, ఓట్లు మాత్రం ఆరేడు వందల దాకా వుంటాయి. ఆ ఊళ్ళో ఉన్నవన్నీ పూరిగుడిసెలే అనిపించకపోయినా ఆ కోవకి చెందినవే. అందరూ కాయ కష్టం చేసుకొని బ్రతికే బడుగు జీవలే. ఏ రోజు పనికి పోకపోతే ఆ రోజు పస్తు పడుక్కోవలసిన పరిస్థితి. ఎన్నికలప్పుడు మాత్రమే నాయకులొస్తుంటారు ఆ గ్రామంలోకి. ఆ తర్వాత ఎప్పుడూ కన్పించరు. అవసరపడి గ్రామస్తులెవరైనా నాయకులకోసం వెళ్తే ఎవరో ఎరగనట్లే ముఖం చాటేస్తారు.

ఎన్నికలొస్తున్నాయగా ముందు తమ అనుచరుల్ని పంపుతారు మంచి మాటల్తో (మాయమాటల్తో) మచ్చిక చేసుకోవడానికి. ఆ తర్వాత "మందీ (మందూ...) మార్బలం"తో నాయకులు ఒకరొకరుగా వెళ్తారు. ఆ వెనక అసలు పాత్రధారి రంగ ప్రవేశం చేస్తాడు. "రాజు వెడలె రవితేజములలరగ" అన్నట్టు. అంతకుముందు ఎన్నికలలో చెప్పిన మాటల్నే మళ్ళీ మళ్ళీ వల్లె వేసినా అదేదో కొత్త పదాల్లాగే వింటారు. వెదజల్లిన నోట్లని ఏరుకుంటారు. ప్రవహించే సారా ఏరుల్లో పీకల దాకా మునుగుతారు. ఆ తర్వాత ఎవరికితోచినట్టు వాళ్ళు ఓట్లేస్తారు. ఆపైన మళ్ళీ మామూలే. తమ నిత్య పోరాటం. ఆకలితో ఏ కూలి డబ్బుల కోసం ఆరాటం. దొరికిన నాడు తినడం లేని వాడు పస్తుపడుకోవడం.

అప్పుడే ఇంట్లోకి వచ్చాడు సుబ్బయ్య. పొద్దుటనగా పొలం పోయాడు కలుపుతీతకి. ఊళ్ళో ఎలక్షన్ల హడావుడికి అతని మనసులాగుతున్నా, ఇప్పటికే బాగా పెరిగిపోయిన కలుపు పీక్కపోతే మొదటికే మోసం వస్తదేమోనని పొలం పోయాడు.


బారెడు పొద్దెక్కి కడుపులో ఆకలి కరకరమంటున్నా పని పూర్తికాందే ఇంటికి పోకూడదనుకున్నాడు. రెండు రోజులుగా బయట పనికి పోకపోవడంతో రాత్రిళ్ళు పస్తు పడుకుంటున్నారు మొగుడుపెళ్ళాలు.


పెళ్ళయి పదేళ్ళయినా ఒక్క నలుసు కూడా కలక్కపోవడం, గుండెల్లో కలుక్కుమంటున్నా... "ఆళ్ళకింత కూడెట్ట లేకపోతే ఆళ్ళ ముఖాలు చూసి ఇంకెంత బాధపడాలో" అని సరిపెట్టుకుంటున్నారు ఇద్దరూ.

పై కండువా మంచం మీద పడేసి దొడ్డివైపున్న గోలెం దగ్గర కెళ్ళి ముఖం కాళ్ళు చేతులు కడుక్కున్నాడు. మళ్ళా లోపల కొచ్చి నులకమంచం మీద నిస్త్రాణగా వాలిపోయాడు. "రా మావా.. కూసంత ఎంగిలి పడుదుగాని" అంటూ లోపలకొచ్చింది అతడి పెళ్ళాం రాములు. ఆశ్చర్యంగా చూసాడు ఆమెవంక. "లచ్చుమక్కనడిగి కాసిన్నూకలట్టుకొచ్చి గంజి కాసాను. ఇంతుప్పేసుకొని మిరగాయ నంజుకొని తాగుదువు రా" అంటూ వివరించింది ఆమె.

రాత్రి నుంచి ఏమీ తినకపోవడంతో గంజి పేరు చెప్పేసరికి నోట్లో నీళ్ళూరాయి సుబ్బయ్యకి. పెళ్ళాం వంక ప్రేమగా చూసాడు. అతడి చూపులుకి సిగ్గుపడుతూ లోపలికి వెళ్ళింది రాములు. ఆమె వెనకే వెళ్ళాడు సుబ్బయ్య.

సత్తు గిన్నెలో గంజిపోసి రెండు మిరపకాయలు, ఉప్పు రాచ్చిప్ప పక్కన పెట్టింది. గిన్నె ముందుకూచున్నాడు సుబ్బయ్య. "నువ్వు తాగావా..." అడిగాడు పెళ్ళాన్ని. "లేదు మావా నీతోపాటు తాగుదామని కూసున్నాను" అంటూ మరో గిన్నెలో పోసుకొని తనూ తెచ్చుకుంది రాములు. గిన్నె అందుకొని పరమాన్నంలా తాగబోతుండగా ఒక్కసారిగా తమ ఇంటి ముందు కలకలం వినిపించడంతో ఇద్దరూ గిన్నెల్ని కింద పెట్టి బయటకు వెళ్ళారు.





అధికార పార్టీ అభ్యర్థి ఎన్నికల్లో గెలిస్తే కాబోయే మంత్రి తన అనుచరగణంతో వస్తున్నాడు. వెనకాల మైకులో పాటలు వినపిస్తున్నాయి. కొందరు డప్పులు వాయిస్తుంటే మరి కొందరు ఆ శబ్దాల కనుగుణంగా కుప్పిగంతులు. బహుశా వాళ్ళ దృష్టిలో నాట్యం కాబోలు... వేస్తున్నారు. నాయకుల్ని చూసి భార్యాభర్తలిద్దరూ బొమ్మల్లా నిలబడిపోయారు. "ఏం సుబ్బయ్యా... బాగున్నావా..." అంటూ పలకరించాడు అభ్యర్థిగా పోటీ చేస్తున్న వ్యక్తి. తన పేరు పెట్టి పలకరించడంతో పొంగిపోయాడు సుబ్బయ్య. "ఏం బాగులే దొరా..." అంటూ రెండు చేతులూ జోడించాడు. అతని పక్కనే నిలబడ్డ రాములు అభ్యర్థి చూపులతో ఎక్కడ తడుముతున్నాడో అర్థమయి పైట కొంగు నిండుగా కప్పుకొని చేతులు జోడించింది. "అదేందిరా అట్టగంటావ్. మన ముఖ్యమంత్రి గారు మీలాంటోళ్ళ కోసం ఎన్నెన్ని పథకాలు పెట్టి ఎంతో సేవ జేస్తుంటే. ఆయన పేదోళ్ళ ఉన్నతి కోసమే తన జీవితాన్ని అంకితం జేసిండు. నేను మాత్రం మీ కోసమే గదా శమిస్తుంట. మా పాలనలో పేదోడే భగవంతుడు. పేదోడు తిండి తింటేనే గద మాకు మనశ్శాంతి. నేను మాత్రం ఒకప్పుడు మీలాగే పూటకి లేని పరిస్థితిలో బతికినోణ్ణి గాదా. మీ బాధలేంటో తెలిసినోణ్ణి గనకనే మీ యందరినీ ఆదుకోవాలనే గందా యీ రాజకీయాల్లోకొచ్చిన. మీ సేవలోనే యీ స్థితి గొచ్చిన. నేను మీ వోణ్ణి. మీకేం అవసరమొచ్చినా నేనున్నానని మర్చిపోమాక" అంటున్న అభ్యర్థిని

## స్లిమ్‌గా మారిన చిరు

'రాగూర్' చిత్రంలో సన్నగా కనిపించాలనే ఉద్దేశ్యంతో చిరంజీవి నిరంతరం శ్రమ పడి బాగా సన్నబడ్డాడు. ఆయన 'ఇంద్ర' చిత్రంలో డాన్స్ స్టెప్స్ తనకు విజయాన్ని చేకూర్చాయన్న నమ్మకంతో ఉన్నాడు. అందువల్లనే 'రాగూర్' విజయం కోసం సన్నబడి మరీ శ్రమిస్తున్నాడు. ఇప్పుడు చిరంజీవిని చూసిన వారంతా స్లిమ్‌గా ఉన్నావని తెగపొగిడేస్తున్నారు.

విస్తుపోతూ చూస్తున్నాడు సుబ్బయ్య.

"ఏంటి సుబ్బయ్య అలా చూస్తావు. నేను మీ వోణ్ణి అంటే నమ్మలేకపోతున్నావా ఏంది" అంటూ ఓసారి అటూ యిటూ చూశాడు. "ఏంటి పిల్ల కాయలు ఆడుకోటానికి బోయారా..." అన్నాడు. "నాకు పిల్లలు కలగలేదు బాబూ" సిగ్గుపడుతూ చెప్పాడు సుబ్బయ్య.

కొంచెం గతుక్కుమన్న సర్దుకున్నాడు అభ్యర్థి. "అడ్డెడ్డె అట్టాగా నేను గెలిసిన తర్వాత నీకు, మీయావిడికి పరీచ్చలు జేపించి వయిజ్జం జేపించి పిల్లలు పుట్టేట్టు సూత్తాను" అన్నాడు రాములొంక అదోలా చూస్తూ. "నిజం సుబ్బయ్యా. నేను మీ వోణ్ణి. మీ మడిసిని. సూడు ఈ పూట నేను కూడా మీతో బాటే మీ యింట బోజనం జేస్తను..." అంటూ చొరవగా లోపలి గదిలోకి వెళ్ళాడు. అతని వెనుకే నడిచారు మిగిలిన వాళ్ళు. వాళ్ళతో బాటు సుబ్బయ్య, పెళ్ళాం కూడా!

వాల్చి ఉన్న పీట ముందు గంజి గిన్నెలు, మిరపకాయలు కన్పించాయి. వాటిని చూస్తూ "అప్పుడే ఏర్పాట్లు గూడా జేసేసిందే మీ యావిడ" అంటూ ఓ గిన్నె అందుకున్నాడు అభ్యర్థి. మరో గిన్నె చేతిలోకి తీసుకున్నాడు మరో ఛోటా నాయకుడు. స్థాణువులై నిలబడిపోయారు సుబ్బయ్య, రాములు. నోటి దగ్గర కూడు జారిపోతుందన్న బాధతో. రెండు రోజుల ఆకలి వాళ్ళ కడుపులో సుళ్ళు తిరుగుతోంది. కడుపులో దేవుతున్నట్టన్పిస్తున్నా అమృతం తాగుతున్నట్లుగా ముఖాలు పెట్టారు. ఈలోపు ఎవరో కెమెరా క్లిక్ మన్పించారు చక చకా నాలుగైదు సార్లు. ఇద్దరూ తాగామన్నట్లుగా పెదాలకు అంటించుకున్నారు గంజి చుక్కల్ని. గిన్నెలు కింద పెట్టేశారు.

"సుబ్బయ్య మరి నువ్వూ, మీ ఆవిడా ఓట్లు నాకే వేసి నన్ను గెలిపించాలి. మీ వెనకే నేనుంటా. మీ కోసం ఏమైనా చేస్తా" అంటూ చేతులు జోడించి బయటకు నడిచాడు అభ్యర్థి. అతని వెనుకనే కదిలి వెళ్ళిపోయింది అనుచరగణం.

ఒంటరిగా మిగిలిపోయారు భార్యాభర్తలిద్దరూ! వాళ్ళ మధ్యలో ఎంగిలి పడిన గంజి గిన్నెలు. "దేశంలో రాజకీయనాయకులు స్కాముల్లో తినగా మిగిలిన "ఎంగిలి మెతుకులేగా ప్రజలకు విసురుతున్నది. పరవాలేదు ఎంగిలైతేనేం... మమ్మల్ని అందుకోండి" అన్నట్లుగా. ❋

## శ్రీకాంత్ ఉదారత

ఇటీవల ఇంటర్‌మీడియట్‌లో మంచి మార్కులు పొంది, ఇంజనీరింగ్, మెడిసన్ కోర్సులలో మంచి ర్యాంకులను సాధించిన పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించలేని స్థితిలో ఉన్నవారు గత కొన్ని రోజులుగా పేపరు ప్రకటన ద్వారా ఆర్థిక సహాయాన్ని కోరుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఎన్టీఆర్ పేద విద్యార్థినికి ఐదు లక్షలు విరాళంగా ఇచ్చాడు. అదే స్ఫూర్తితో శ్రీకాంత్ తెనాలికి చెందిన లక్ష్మీ సరోజ అనే అమ్మాయికి లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించాడు. లక్ష్మీ సరోజ ఇంటర్‌మీడియట్‌లో 975 మార్కులతో రాష్ట్రంలో 10వ ర్యాంకు పొందడమేకాకుండా, బిట్స్ పిలానిలో కంప్యూటర్ సైన్స్‌లో సీటు సంపాదించింది. ఎన్టీఆర్ ఉదారత చూశాక తనకు ఈ స్ఫూర్తి కలిగిందని శ్రీకాంత్ అన్నాడు.

